
ప్రజాశక్తి
ఆదివారం 21 జులై 2024
5
విజయనగరం



టోల్‌గేట్‌ను తరలించండి

కేంద్రమంత్రి గడ్కరీకి మంత్రి కొండపల్లి లేఖ

విజయనగరం : జొన్నాడ సమీపంలో బోడమెట్టపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేట్‌ను బైపాస్ రోడ్డులోకి మార్చాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి చిన్నతరహార పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లేఖ రాశారు. ఈ టోల్‌గేట్ వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వాహనదారలకు పెను భారంగా మారిందని పేర్కొన్నారు. టోల్‌గేట్ ఏర్పాటు చేసేముందు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టలేదని, నిబంధనలను పాటించలేదని పేర్కొన్నారు. రాయపూర్-విశాఖపట్నం 26వ జాతీయ రహదారిపై మోదవలస నుంచి గొట్లాం వరకు రోడ్డును విస్తరించి, నాలుగు లేన్ల రహదారిగా నిర్మాణం పూర్తిచేసి, దాదాపు ఐదేళ్ల క్రితమే వినియోగంలోకి తెచ్చారని తెలిపారు. ఇప్పుడు ఈ రోడ్డుపై కొత్తగా టోల్‌ప్లాజాను ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. వినియోగంలోకి వచ్చిన 45 రోజుల్లోనే టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసి రుసుం వసూలు చేయాల్సి ఉందని, కానీ వినియోగంలోకి వచ్చిన ఐదేళ్ల తరువాత ఇక్కడ టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసి, ఈనెల రెండో తేదీ నుంచి వసూళ్లు మొదలు పెట్టడం నిబంధనలకు విరుద్ధమని వివరించారు.

ప్రజల గొంతుకవుతాం

జిల్లా ఎమ్మెల్యేల మనోగతం | **రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు**

నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తెలిపారు. ఈనెల 22 నుంచి వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు తొలిసారి శాసనసభలో మాట్లాడే అవకాశం లభించనుంది. ఈనేపథ్యంలో తాము అసెంబ్లీలో ప్రస్తావించదలచిన అంశాలను ప్రజాశక్తికి తెలిపారు.

– ప్రజాశక్తి, విలేకర్ల బృందం

గిరిజన యూనివర్సిటీపై చర్చిస్తా



ఈ సమావేశాల్లో ప్రధానంగా మూడు అంశాలను సభ దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నాను. గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలం రెల్లిలో ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకెళ్తా. ప్రధానంగా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి రోడ్ల గుంతలు పూడ్చేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతాను. శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలపాలని సమావేశాల్లో ప్రస్తావిస్తాను.

- కోళ్ల లలితకుమారి, శృంగవరపుకోట ఎమ్మెల్యే

రైతుల సమస్యలను ప్రస్తావిస్తా



గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రైతులను పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది. బాధ్యతలేని ప్రభుత్వం వల్ల రైతులకు కష్టాలొచ్చాయి. కోలుకోలేని విధంగా నష్టపోయారు. గత వైసిపి సర్కారు తోటపల్లి ప్రాజెక్టు, కాలువలపై తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. జిల్లాలోని రైతులకు ఐదేళ్లపాటు తోటపల్లి నుంచి సాగునీరు అందకపోవడంతో పంటలు పండక రూ.2 వేల కోట్ల మేర రైతులకు నష్టం వాటిల్లింది. దీనిపై అసెంబ్లీలో ప్రస్తావించి, సాగునీటి కాలువల కోసం నిధుల విడుదలకు కృషి చేస్తాను. నియోజకవర్గంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాను.

- కిమిడి కళావెంకటరావు, చీపురుపల్లి ఎమ్మెల్యే

రామతీర్థ సాగర్‌కు నిధులు కోరుతా



నియోజకవర్గ ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపిస్తాను. ప్రస్తుతం మాకు అసెం బ్లీలో చర్చించడానికి ప్రశ్నలు ఇంకా అడగలేదు. అవకాశం వస్తే కచ్చితంగా నియోజకవర్గంలో ప్రధానంగా తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని, సంబంధిత నిధులు గురించి చర్చిస్తాను. తద్వారా సాగునీరుతో పాటు తాగునీరు సమస్య కొంత పరిష్కారమవుతుంది. నియోజకవర్గంలో ఎక్కువగా ఉప్పునీరు కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నందున తాగునీటి సమస్య పరిష్కారంపై చర్చిస్తాను. ప్రభుత్వ భూముల పరిరక్షణ, రైతాంగానికి అవసరమైన ఇరిగేషన్ కాలువలు, వాటి సామర్థ్యం ఎలా పెంచుకుంటామన్నది దానిపై చర్చిస్తాను. 596, 117 జీవోలను రద్దు చేయమని కోరుతాను. తీరప్రాంతం మత్స్యకార గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలపై చర్చిస్తాను.

- లోకం నాగమాధవి, నెల్లిమర్ల ఎమ్మెల్యే

గిరిజనుల సమస్యలను ప్రస్తావిస్తా



తొలి అసెంబ్లీ సమావేశాల్లో గిరిజన సమస్యలను ప్రస్తావిస్తాను. ఐదేళ్ల వైసిపి పాలనలో రోడ్లు దుస్థితి దారుణంగా ఉంది. పార్వతీపురం-కొమరాడ ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. గిరి శిఖర గ్రామాలకు రోడ్లు లేక గిరిజనులకు మెరుగైన వైద్యం అందడం లేదు. నేటికీ చాలా గ్రామాల్లో డోలీల మోతలే శరణ్యం అవుతున్నాయి. వ్యాధుల వ్యాప్తితో రోగుల సంఖ్య పెరుగుతుందని ఆసుపత్రులకు వస్తున్న వారికి బెడ్లు చాలడం లేదు. ఏజెన్సీలో వైద్యం మెరుగుకు ప్రభుత్వం సహకారం అందించాలి. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రతి గ్రామంలోను పాఠశాలలు ఏర్పాటు చేయాలి.

- తోయక జగదీశ్వరి, కురుపాం ఎమ్మెల్యే

'జంపరకోట'కు నిధులు కోరుతా



నియోజకవర్గంలో ప్రధానమైన జంపరకోట జలాశయం నిర్మాణానికి నిధులు కోరుతాను. తోటపల్లి ఎడమ కాలువ ఆధునీక రణ పనులు వేగవంతం గా పూర్తయ్యేలా అసెంబ్లీలో చర్చి స్తాను. నియో జకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నూతన భవనం నిర్మాణానికి ప్రస్థావిస్తాను. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న సమస్యలపై కూడా మాట్లాడుతాను.

- నిమ్మక జయక్రిష్ణ, పాలకొండ ఎమ్మెల్యే

సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా..



రాజాం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. రాజాంలో డ్రైనేజి వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, వాటిని అండర్ డ్రైనేజీగా తీర్చిదిద్దేందుకు అసెంబ్లీలో చర్చిస్తాం. ట్రాఫిక్ ఇబ్బందులు దృష్ట్యా ప్లైఓవర్‌ను ఏర్పాటుకు చర్చిస్తాం. రాజాం- పాలకొండ ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. వాటిపై అసెంబ్లీలో చర్చిస్తాం. ఈ నాలుగు మండలాలకు తోటపల్లి, మడ్డువలస జలాశయాల శివారు గ్రామాల వరకు సాగునీరు, తాగునీరు అందించేందుకు మాట్లాడతాను. రాజాంలో ఉన్నత విద్యకు కళాశాల ఏర్పాటు, ఆకులలోవ, కట్టగెడ్డ, రేగిడి సాయన్న ఛానల్ ఆధునీకరణ పనులపై అసెంబ్లీలో చర్చిస్తాను.

- కోండ్రు మురళీమోహన్, రాజాం ఎమ్మెల్యే

ఆర్‌అండ్‌బి రోడ్ల దుస్థితిని వివరిస్తా..



అసెంబ్లీ సమావేశాల్లో పారాది వంతెన, ఆర్‌అండ్‌బి రోడ్లు దుస్థితిపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను. టిడిపి ప్రభుత్వ హయాంలో పారాది వంతెన నిర్మాణానికి తన సోదరుడు సుజయకృష్ణ రంగారావు మంత్రిగా ఉన్న సమయంలో నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిధులను వెనక్కి మళ్లించి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాయి. ఆర్‌అండ్‌బి రోడ్లు పాడైపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బి రోడ్లకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. శివడవలస, లోచర్ల వద్ద తోటపల్లి కాలువపై ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు నిధులు కోరుతాను.

- బేబినాయన, బొబ్బిలి ఎమ్మెల్యే

తాగు, సాగునీటి సమస్యపై ప్రస్తావిస్తా..



నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన తాగునీటి సమస్యను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తాను. దాంతో పాటు సాగునీటి సమస్యపై మాట్లాడుతా. గత టిడిపి ప్రభుత్వ హయాంలో జిల్లాకు మేలు చేకూరేలా మా తండ్రి హయాంలో ఇటు రైతులకు, అటు తాగునీరు సమస్యను అధిగమించడానికి నదులు అనుసంధానించాలని భావించారు. దాని పూర్తిచేసే విధంగా తోటపల్లి రిజర్వాయర్ నుంచి గడిగడ్డ, గడిగడ్డ నుంచి చంపావతి అనుసంధానం చేయగలిగితే రైతులకు రెండు పంటలకు సాగునీరు అందుతుంది. విజయనగరం కార్పొరేషన్‌కు తాగునీటి సమస్య తీరుతుంది. గత వైసిపి ప్రభుత్వం ఈ విషయాలపై పూర్తి నిర్లక్ష్యం వహించింది. ఇవి పూర్తి చేయగలిగితే విజయనగరానికి నీటికష్టాలు తీరినట్లే. జిల్లా సర్వ జన ఆస్పత్రిలో సిబ్బంది, పడకల కొరతపై ప్రస్తావిస్తాను.

- పి.అదితి గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కోరుతా..



పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సమావేశంలో కోరుతాను. పెండింగ్ లో ఉన్న వంతెనలు, రహదారులు పనులకు, జంఝావతి, ఆడారు జలాశయ పథకాలకు నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. నూతనంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి అనుగుణంగా భవనాలు సౌకర్యాలు ఏర్పాటుకు పనులు మంజూరు చేసి ప్రారంభిస్తే రాబోయే ఐదేళ్లలో పూర్తవుతాయి. బలిజిపేట సీతానగరం పార్వతీపురం మండలాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీరు తాగునీరు, రహదారి మౌలిక సదుపాయాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కోరుతా..

- బి.విజయ్‌చంద్ర, పార్వతీపురం ఎమ్మెల్యే

సాగుదారుల సమస్యలు పరిష్కరించాలి

దేవాదాయ భూములపై రైతులకు హక్కు కల్పించాలి ● సదస్సులో ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో వేలాదిగా ఉన్న దేవాదాయ, ధర్మాదాయ భూముల సాగుదారుల సమస్యలు పరిష్కరించి భూమిపై వారికి పూర్తి హక్కులు కల్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యాన జిల్లా సదస్సు స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగింది. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో మర్రాపు.సూర్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో వేలాదిగా వున్న వివిధ దేవాదాయ ధర్మాదాయ భూ సాగుదారులు, కౌలు దారులులో 90శాతం మంది సన్నచిన్న కార, సొంతభూమి లేని రైతులే కౌలుకు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. వార సత్వంగా తాత తండ్రుల నుంచి సాగుచేస్తు అవే భూములపై ఆదారపడి ఉన్నారన్నారు. ఈ కౌలుదారులకు కార్డులు అందకపోవటం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పెట్టుబడిసాయం, విత్తనం, బ్యాంక్ రుణాలు, బీమా సౌకర్యం, నష్ట పరిహారాలు, రాయతీలు పొందలేకపోతున్నారని తెలిపారు. గతంలో సాగుదారుల నుంచి ఎండోమెంట్ అధికారులు కౌలు మూడేళ్ల కొకసారి ధర పెంచి అదే రైతును కొనసాగించేవారని, ఈ మధ్య కాలంలో బహిరంగ వేలం పాట పెట్టి ఎవరు ఎక్కువ ధరకు పాడితే వారికే కౌలు నిర్ణయించే విధంగా మార్పులు చేశారని తెలిపారు. ఈ విధానం వల్ల పేద సాగుదారులు వేలంలో పోటీపడి ఎక్కువకు పాడలేక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. విజయనగరంలో మాన్సాస్ తదితర సంస్థలు కింద 16వేల ఎకరాల భూములను సుమారుగా 30వేల మంది రైతులు సాగుచేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. కౌలుదారులను తప్పించి రియల్ ఎస్టేట్, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారని తెలిపారు. కొంతమంది వారసత్వం గా వచ్చిన రైతుల భూములు కూడా దేవాలయ భూములు కింద నమోదుచేసి వారి భూహక్కులను వివాదాల పెట్టి అడ్డుకొంటున్నారని తెలిపారు. గతంలో సుప్రీం కోర్టు చిన్న సన్న కారు సాగుదారులకు బహిరంగ వేలం వెయ్యకుండా 13శాతం కౌలు పెంచి వారినే కొనసాగించాలని ఇచ్చిన మినహాయింపును పక్కనపెట్టి ప్రభుత్వాలు ఎండోమెంట్ అధికారులు ద్వారా బహిరంగ వేలానికి పూనుకుంటోందని తెలిపారు. ఈ నేపథ్యంలో భూసాగుదారులు, కౌలుదారులు ఐక్యమై సమస్యలు చర్చించి పరిష్కరించుకొనేందుకు ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. ఎన్నికలముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రైతు సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాట తప్పదని తెలిపారు. సదస్సులో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.గోపాలం, నాయకులు చల్లా జగన్, ఆదినారాయణ మూర్తి, కౌలు రైతు బంగారయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, నాయకులు అల్లు అప్పలస్వామి, దేవాదాయ,ధర్మాదాయ భూ సాగు కౌలు దారులు పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ కె.వెంకటరమణ, మద్దిల రమణ, రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

నూతన కమిటీ ఏర్పాటు

సదస్సు సందర్భంగా దేవాదాయ,ధర్మాదాయ శాఖ భూ పోరాట నూతన కమిటీ ఏర్పాటైంది. జిల్లా కన్వీనర్‌గా కురిమినేని వెంకటరమణ, కో కన్వీనర్‌గా రాకోటి రాములు, సభ్యులుగా అల్లు అప్పలస్వామి, కండి పిల్లి రామారావు, మామిడి సత్యనారాయణ, లెంక సూరిబాబు, మహంతి రామారావు, కర్రి పెద్దినాయుడు, పెద్దా ఆదినారాయణ, బంక చిన్నం నాయుడు ఎన్నికయ్యారు.

విద్యుదాఘాతంతో

తండ్రి, కుమార్తె మృతి

మేడపై ఆరేసిన దుస్తులు తీస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో విద్యుత్ షాక్‌తో తండ్రి కూతురు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపి వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టా సూర్యారావు (45), ఆయన కుమార్తె సంధ్యారాణి (22) గ్రామంలో తమ ఇంటి మేడపై బట్టలు ఆరవేశారు. సంధ్యారాణి శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో మేడపై వేసిన బట్టలను తేవడానికి వెళ్ళింది. అందులో ఒక చీర ఇంటిపై ముందు భాగం నుంచి వెళ్తున్న కరెంటు వైరు పై పడింది. దాన్ని తీసేందుకు ప్రయత్నించగా ఆ చీర తడిగా ఉండడంతో పాటు వర్షం కూడా పడుతుండడంతో ఆమె వెంటనే కరెంటు షాక్‌కు గురై అక్కడే పడి ఉండిపోయింది. మేడ మీదకి వెళ్ళిన కుమార్తె ఎప్పటికీ కిందకి రాకపోవడంతో తండ్రి సూర్యారావు మేడపైకి వెళ్ళాడు. అప్పటికే పడిపోయి ఉన్న కుమార్తెను పైకి లేపేందుకు ప్రయత్నించాడు. దీంతో తండ్రి సూర్యారావు కూడా కరెంట్ షాక్ గురై పడిపోయాడు. అక్క తండ్రి పైకి వెళ్లినవారు రాలేదని కుమారుడు మనోజ్ మేడ మీదకు వెళ్ళాడు. అప్పటికే ఇద్దరు పడిపోయి ఉన్నారు. వీరిని ముట్టుకునే సమయంలో మనోజ్ కూడా కరెంట్ షాక్ తగిలింది. మనోజ్ వెంటనే తేరుకుని పక్కనే ఉన్న కర్రతో వారికి అంటుకున్న వైర్‌ను కొట్టి వారిద్దరినీ పక్కకు లాగాడు. కొన ఊపిరితో ఉన్న వీరిని వెంటనే స్థానికుల సహాయంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరూ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను వెంటనే స్వగ్రామం తరలించి అంత్యక్రియలు నిర్వహించేశారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదు. ఈ విషయం పై స్థానిక ఎస్ఐ కృష్ణమూర్తిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా సంధ్యారాణి

సంధ్యారాణి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. సూర్యారావుకు భార్య శకుంతలతో పాటు కుమార్తె సంధ్యారాణి, కుమారుడు మనోజ్ ఉన్నారు. కుమారుడు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఒకేసారి భర్త, చేతికి అంది వచ్చిన కుమార్తె చనిపోవడంతో భార్య, కుమారుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సీజనల్ వ్యాధులతో

ఏ ఒక్కరూ మరణించకూడదు

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో సీజనల్ వ్యాధుల వలన ఏ ఒక్కరూ మరణించకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సీజనల్ వ్యాధులు, పారిశుధ్యంపై ఎంపిడిఒలు, వైద్యాధికారులు, ఇఒపిఆర్‌డిలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇఒపిఆర్‌డిలు రెండు రోజుల్లో పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల వారీగా సమీక్షించి పారిశుధ్యం మెరుగుదలకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతవారం జరిగిన గ్రామ సందర్శన లో పారిశుధ్యం పైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయని, వచ్చే గ్రామ సందర్శన నాటికి వాటన్నిటినీ పరిష్కరించాలని ఆదేశించారు. ఎవరైనా నోడల్ అధికారి ఏ కార్యదర్శి పైన ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబల కుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో మెడికల్ అధికారులు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు సమీక్షించాలన్నారు. మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి సందర్శనలు చేయాలని, అప్పుడే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల వసతులు, సౌకర్యాలు, వైద్యులు ఉన్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రులకు ఎందుకు వెళ్తున్నారని వైద్యుల్ని ప్రశ్నించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రైవేటు ఆసుపత్రులకు, విశాఖపట్నం వెళ్లకుండా చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కర రావు మాట్లాడుతూ వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. డిసిహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీ శంకరరావు మాట్లాడుతూ ఇనిస్టిట్యూషనల్ డెలివరీలను పెంచుతామని తెలిపారు. డిపిఒ శ్రీధర్ రాజా మాట్లాడుతూ క్లోరినేషన్ చేసి, శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి, డ్రై డే లను పాటించడం ద్వారా పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని తెలిపారు.

ప్రజలు బుద్ధి చెప్పినా మార్పులేదు

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

గత అయిదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో విధ్వంసాలు, అరాచకాలు, పోలీసులను అడ్డం పెట్టుకుని కక్ష సాధింపు చర్యలతో ఆటవిక పాలన సాగించారని టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున విమర్శించారు. ప్రజలు బుద్ధి చెప్పినా వైసిపి నాయకుల్లో మార్పు రాకపోవడం శోచనీయమని అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది దళితులు, ముస్లింలు, బలహీన వర్గాల వారిపై దాడులు, హత్యలు జరిగినా కనీసం ప్రశ్నించలేని వైసిపి నాయకులు నేడు ప్రజాస్వామ్య పద్దతిలో పాలన సాగిస్తున్న కూటమి పాలనలో హింస రాజ్యమేలుతుందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. వైసిపి లాంటి విధ్వంసకర పార్టీకి మనుగడ ఉండదనే భయంతో ఆ పార్టీ నాయకులు ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో చేసిన అరాచక, అప్రజాస్వామిక చర్యల వలన, అబద్ధపు ప్రచారాలు చేయడం వలనే ప్రజలు ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పారని అన్నారు.

గిరిజన యూనివర్సిటీపై బంతాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు విషయంలో రాష్ట్రంలోని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు బంతాట ఆడుకుంటున్నాయని జనం చెప్పుకుంటున్నారు. ఇదే అదునుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా నిధులు కేటాయించకుండా తప్పించుకుంటోంది. చివరికి వర్శిటీ కోసం ఎదురు చూస్తున్న ప్రజానీకం మోసపోతున్నారు. ప్రస్తుతం అందులో చేరిన విద్యార్థుల బంగారు భవిష్యత్తు నాశనమౌతోంది. ఇటీవల కాలంలో జిల్లాలో సాగుతున్న పబ్లిక్ టాక్ ఇది. ఇందుకు కారణం లేకపోలేదు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం మంజూరు చేసిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పాచిపెంట మండలంలోని ఓ గ్రామం, సాలూరు మండలం కొట్టక్కి, విజయనగరం మండలం గుంకలాం, కొత్తవలస మండలం రెల్లి గ్రామాల్లో అప్పటి టిడిపి ప్రభుత్వం భూములు పరిశీలించింది. చివరికి 2019 సాధారణ ఎన్నికలకు ముందు కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధిలో 526 ఎకరాలను వర్శిటీ కోసం కేటాయించారు. హడావుడిగా ప్రహరీ గోడల నిర్మాణం కూడా చేపట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మెంటాడ మండలం కుంటినవలస మధుర గ్రామం చినమేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలసలో రెవెన్యూ పరిధిలోకి మార్పుచేసింది. ఎలా చాలా కాలం సాగగీత తరువాత గత ఏడాది ఆగస్టు 25న ఎట్టకేలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రెండో సారి శంకుస్థాపన చేశాయి. ఈ సందర్భంగా వర్శిటీ నిర్మాణానికి రూ.834కోట్లు కేటాయించినట్టు అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ప్రకటించించారు. భూ సేకరణ పూర్తయినప్పటికీ ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. తాజాగా తిరిగి టిడిపి నాయకత్వంలో టిడిపి, జనసేన, బిజెపికి కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ స్థలాన్ని మార్పుచేస్తామంటూ టిడిపి నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి వినతిపత్రం కూడా అందజేశారు. తిరిగి కొత్తవలస మండలం రెల్లిలోనే ఏర్పాటు చేయాలని వినతిలో పేర్కొన్నారు. దీన్ని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఖండిస్తూ ఏజెన్సీ ప్రాంతమైన సాలూరు నియోజకవర్గంలోనే గిరిజన యూనివర్శిటీ నిర్మించాలని, స్థలాన్ని మార్చడం తగదని అన్నారు. దీన్నిబట్టి చూస్తుంటే అటు వైసిపి, ఇటు టిడిపిలకు విద్యార్థుల భవిష్యత్తుకన్నా పంతాలు, పట్టింపులే ఎక్కువగా భావిస్తున్నాయని జనం విమర్శిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. కేంద్ర, రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడితే అభివృద్ధిలో దూసుకుపోతామంటూ ప్రధాని నరేంద్రమోడీ చెప్పినప్పటికీ, ఆచరణలో అది కనిపించడం లేదు. నిధులు విడుదల చేయకపోయినా టిడిపి ప్రశ్నించడం లేదు.



ప్రస్తుతం గాజులరేగ సమీపంలో పాత ఎయు క్యాంపస్‌లో గిరిజనవర్శిటీ తరగతులు నిర్వహిస్తున్నారు. వర్శిటీలో సుమారు 200మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం 13డిపార్ట్‌మెంట్లలో 14 రకాల కోర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరికొన్ని కోర్సుల ఏర్పాటుకు అనుమతులు లభించినప్పటికీ వసతి సమస్య వల్ల ముందుకు సాగలేని పరిస్థితి. ఉన్న డిపార్ట్‌మెంట్లకే భవనాలు, గదులు సరిపోవడం లేదు. ఇక విద్యార్థుల సమస్యల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. లేబొరేటరీ, లైబ్రరీ, ఆటస్థలాలు, జిమ్, పరిశోధనకు అవసరమైన ఇతర సదుపాయాలు లేకపోవడం వల్ల సీతం, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీలు, మాన్సాస్ పరిధిలోని ఎంఆర్ అటానమస్, ఎంఆర్ డిగ్రీ కాలేజీలపై ఆధార పడుతున్నారు. తరగతులు ఒకచోట, ప్రయోగాలు మరోచోట, పరిశోధనలు ఇంకోచోట జరుగుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్శిటీకి హాస్టల్ నిర్వహణకు నిధులు ఉన్నప్పటికీ అందుకు తగ్గ భవనం లేదు. దీంతో, సమీపంలోని అప్పటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు చెందిన సీతం కాలేజీ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుని, అక్కడ 100మంది విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించారు. మిగిలిన విద్యార్థులు అక్కడ కూడా ఉండేందుకు అవకాశం లేకపోవడంతో ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇక సెమినార్ హాళ్ళు, ఆట స్థలాలు, సెంట్రల్ లైబ్రరీ వంటి సదుపాయాల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. గిరిజన ప్రాంతాలపై పరిశోధనలు అనే మాటే లేదు. దీంతో, గిరిజన వర్శిటీ లక్ష్యం నీరుగారుతోంది. స్థలాల గుర్తింపు, సేకరణకే పదేళ్లు పడితే నిర్మాణానికి, అందుకు తగ్గ నిధులు కేటాయించడానికి ఇంకెన్ని దశాబ్దాలు పడుతుందో అంటూ జనం పెదవి విరుస్తున్నారు.

పోరాం సర్పంచ్ వీరమ్మ మృతి

మెంటాడ : మండలంలోని పోరాం గ్రామ సర్పంచ్ రాగోలు వీరమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు. ఆమె మృతికి సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు సంతాపం తెలియజేశారు. ఆమె భౌతికకాయాన్ని మండల ప్రజాప్రతినిధులు, పలువురు సర్పంచులు, నాయకులు తదితరులు సందర్శించారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

పలువురికి ఎమ్మెల్సీ పరామర్శ

నెల్లిమర్ల : ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు శనివారం పరామర్శించారు. జరజాపు పేటకు చెందిన తాలాడ సన్నిబాబు, తాలాడ శ్రీను, నెల్లిమర్లకు చెందిన జూట్‌మిల్ కార్మిక నేత ఉరిటి ఉమా మహేశ్వర రావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పరామర్శించి వారి చిత్ర పటాలకు అంజలి ఘటించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణ మూర్తి, పోలుబోతు నారాయణ మూర్తి, కనకల హేమావతి, గంటా సతీష్ ఉన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి : డిఇఒ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్నడిఇఒ ప్రేమ్‌కుమార్

వంగర : మండలంలోని యూకోన్నమ్మద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న నాడు నేడు ఫేజ్ -2 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిఇఒ ప్రేమ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆ పాఠశాలలో ఇంతవరకు జరిగిన నాడు నేడు ఫేజ్ టుకు సంబంధించిన పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ సోమేశ్వరరావు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులంతా చక్కగా పని చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ప్రవీణ్, దుర్గారావు, నాడు నేడు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చెరువు గండి వివాదంపై పరిశీలన

డెంకాడ : మండలంలోని పెదాడ పంచాయతీలో అవసరాల చెరువు వర్షాలకు పూర్తిగా నిండిపోయింది. దీంతో గొర్లిపాలెం గ్రామానికి చెందిన కొంత మంది పెదాడ గ్రామానికి చెందిన ప్రజలకు చెప్పకుండా చెరువుకు గండి కొట్టారు. ఈ విషయంపై పెదాడ గ్రామ ప్రజలు తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాల మేరకు తహశీల్దార్ నీటిపారుదల శాఖ జెఇని వెంటనే అవసరాల చెరువును సందర్శించాలని ఆదేశించడంతో ఆయన పరిశీలించారు. నివేదిక ఉన్నతాధికారులకు ఇస్తామని జెఇ చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదాడ పంచాయతీ నాయకులు చిరంజీవి, జనసేన మండలం కో-ఆర్డినేటర్ పైల శంకర్, బుత్తల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తకు బీమా సాయం

కొత్తవలస : మండలంలో కొత్త సంకరపాలెం గ్రామానికి జనసేన క్రియాశీల కార్యకర్త రెంక వెంకట నరేష్ జనవరిలో బైక్ ప్రమాదంలో గాయపడ్డారు. క్రియాశీల సభ్యత్వం చేయించుకోవడంతో ఆయనకు శనివారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.సత్యనారాయణ రూ.25 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గాలి అప్పారావు, ఉపాధ్యక్షులు అంతకాపల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి బంధం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.6.36 లక్షలకు సంత వేలం

కొత్తవలస : 2024-25 సంవత్సరానికి కొత్తవలస వారపు సంత వేలం 6,36,910 రూపాయలకు ఖరారైంది. ఎంపిడిఒ రమణయ్య ఆధ్వర్యాన జెడ్‌పి డిప్యూటీ సిఇఒ రాజకుమార్ శనివారం వేలం నిర్వహించారు. పాలమరశెట్టి గంగరాజు అధికంగా పాడి ఖరారు చేసుకున్నారు. గతేడాది వేలం పాట 5,78,190 రూపాయలకు ఖరారైంది. ఈ ఏడాది ఎనిమిది నెలలకు యాభైవేలు వేలం వేసినట్లు డిప్యూటీ సిఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.దుర్గారావు పాల్గొన్నారు.

సత్యారావుకు జెడ్‌పి చైర్మన్ నివాళి

బొబ్బిలి : అనారోగ్యంతో మరణించిన వైద్యులు రెడ్డి సత్యారావుకు జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఘనంగా నివాళులర్పించారు. శనివారం పట్టణంలో రెడ్డి సత్యారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించిన వైద్యులు మరణం ఎంతో బాధ కలిగించిందన్నారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, తదితరులు ఉన్నారు.

చదరంగంతో జ్ఞాపకశక్తి పెరుగుదల

బొబ్బిలి : చదరంగంతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక శ్రీనిధి పాఠశాలలో శనివారం నిర్వహించిన చదరంగం పోటీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగంపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల పట్ల ఆసక్తి చూపాలని విద్యార్థులు, యువతను కోరారు. పాఠశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అన్ని ఆటల పోటీలలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

సమయపాలన పాటించాలి

నెల్లిమర్ల : సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపిడిఒ గిరిధారి రామారావు కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదని తనకు సమాచారం వచ్చిందని తెలిపారు. సమయపాలన పాటించకుండా ఒక్కొక సచివాలయంలో ఒకరిద్దరు విధులకు గైర్హాజరవుతున్నట్లు తెలిసిందన్నారు. లీవ్ పెట్టాల్సి వస్తే ముందుగా అప్లికేషన్ ఆన్‌లైన్‌లో తెలియపరుస్తేనే లీవ్ అంగీకరిస్తారని చెప్పారు. సమయ పాలన పాటించకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దశకర్ణి కషాయంతో సూక్ష్మపోషకాలు

ప్రజాశక్తి-గజపతినగరం

దశకర్ణి కషాయంతో మొక్కలకు సూక్ష్మపోషకాలు అందుతాయని వ్యవసాయ శాఖ ఎడి మహారాణ తెలిపారు. శనివారం మండలంలోని పిడిశీల గ్రామంలో ఎ. ధనలక్ష్మితో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా దశకర్ణి కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించి, దాని ప్రయోజనాలను వివరించారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

విజయనగరం టౌన్ : రిటైర్డు అయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని, రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బిల్లులు చేయాలని ఎపిటిఎఫ్ (1978) శాఖ నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా సంస్థ అసిస్టెంట్ - డైరెక్టర్ శ్రీమతి జి. వైజయంతికి వినతి అందజేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు కన్ని నెలల నుంచి ఉద్యోగ విరమణ చేసిన వారి ఫైనల్ పే మెంట్లు, రుణాలు, జీవిత భీమా ప్రీమియంలు పరిష్కారం కావడం లేదన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యాలయం ముందు ధర్నా చేస్తామని తెలిపారు. వినతినిచ్చిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వి పైడిరాజు, ఉపాధ్యక్షులు ఎస్ ఎన్ మూర్తి, విజయనగర మండల అధ్యక్షులు ఎస్ హెచ్ పైడితల్లి, కె.సత్యం పి.బాబూజీ పాల్గొన్నారు.

జీవనోపాధిని కాపాడండి

విజయనగరం కోట : జీవనోపాధిని కాపాడండి స్థానిక చేపల మార్కెట్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి వద్ద మొరపెట్టుకున్నారు. శనివారం స్థానిక పైడిమాంబ రిటైల్ మార్కెట్, హోల్ సేల్ మార్కెట్ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి సాలువతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చేపల మార్కెట్లో వ్యాపారాలు చేసుకోవడానికి తామ గతంలో వివిధలు ఏర్పాటు చేసుకుని దానిపై వ్యాపారం సాగించుకుంటున్నామని, వర్షాకాలం, వేసవిలో ఇబ్బంది పడుతున్నందున రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ సభ్యులు గోపాలరావు, లక్ష్మణరావు, వీరబాబు, శ్రీనివాసరావు, రమణమ్మ అరుణ పాల్గొన్నారు.

వర్షంతో పంటలకు నష్టం లేదు

జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు

ప్రజాశక్తి - భోగాపురం, డెంకాడ

ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటలకు ఎటువంటి నష్టమూ లేదని జిల్లా వ్యవసాయాధికారి వి.టి రామారావు అన్నారు. మండలంలోని భోగాపురం, దల్లిపేట, గూడెపువలస తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. గత రెండు రోజులు పాటు కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి నారు మడులను, వరి ఎదజల్లిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో ఉన్న నీటిని గట్లు తెంచి బయటకు విడిచిపెడితే ఎటువంటి ఇబ్బందీ ఉండదన్నారు. నారు మడులకు, ఎదలకు కూడా ఇటువంటి నష్టం ఉండదని తెలిపారు. ఎక్కడైనా పంట నష్టం జరిగి ఉంటే అధికారుల దగ్గర నుంచి నివేదికలు తీసుకుంటామన్నారు. సహాయ సంచాలకులు నాగభూషణం మాట్లాడుతూ క్రమేపీ నీరు బయటకు పోతే ఎటువంటి ఇబ్బందీ ఉండదన్నారు. మండల వ్యవసాయాధికారి హరికృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

దెబ్బ తిన్న పంటను పరిశీలించిన జెడి

డెంకాడ మండలంలో వర్షాల వల్ల దెబ్బతిన్న వరి, నువ్వు పంటలను జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, ఎడి ఎ.నాగభూషణరావు పరిశీలించారు. మండలంలోని సింగవరంలో యద విధానంలో వేసిన వరి పంటను, నువ్వు పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో దెబ్బతిన్న వివిధ పంటలను పరిశీలించిన తరువాత ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి ఇస్తామన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న వ్యవసాయ సిబ్బంది దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికలు సిద్ధం చేసి జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, గ్రామ రైతులు పాల్గొన్నారు.


వరినారును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు


నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అత్యాచారాలను అరికట్టాలని విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మహిళలు, బాలికలపై అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన పట్టణంలోని దేవిబొమ్మ కూడలిలో శుక్రవారం నిరసన చేపట్టారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాలు మారినా మహిళలపై దాడులు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ భారతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు పెరిగాయని చెప్పారు. మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలు పేపర్లకే పరిమితం అవుతున్నాయని, వాటిని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే గంజాయి, డ్రగ్స్ రవాణాను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు అను, మండల కార్యదర్శి చైతన్య, నాయుడు, చరణ్, పార్వతి, అనిత, అనూష, ఉమా, శిరీష పాల్గొన్నారు.

చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో

పొందూరు ఖాదీపై 7న వీడియో పోటీలు

దరఖాస్తులు పంపేందుకు ఆగస్టు ఒకటో తేది ఆఖరు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న పొందూరు ఖాదీపై వీడియో పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ కె. శ్రీకాంత్ ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం రగిలించడమే కాక స్వదేశీ వస్తు ఉద్యమంలో కూడా చేనేత వస్త్ర ఉత్పత్తి కీలక పాత్ర పోషించిందన్నారు. మహాత్మా గాంధీని ఎంతగానో ప్రభావితం చేసిన పొందూరు ఖాదీ వస్త్రాలు శ్రీకాకుళానికి 25కిలోమీటర్ల దూరంలోని పొందూరు గ్రామంలో తయారు కాబడి నేటికీ ప్రసిద్ధి పొందుతున్నాయన్నారు. అందులో భాగంగా భారతీయ చరిత్రలో చేనేత ప్రాధాన్యతకు గుర్తింపుగా 2015 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పొందూరు ఖాదీ తయారీపై 'వీడియో' పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీలో పాల్గొనదలచినవారు పొందూరు ఖాదీ వస్త్ర తయారీలోని అన్ని దశలను పొందుపరుస్తూ చక్కటి వీడియోను రూపొందించాలన్నారు. ఉత్తమ వీడియోకు నగదు పారితోషికం, ప్రశంసా పత్రం అందించి ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. ఉత్సాహవంతులైన వారు ఇతర వివరాలకు పి. శ్రీనివాస రెడ్డి, సహాయ సంచాలకులు, ఫోన్ నెం. 9492344466, కమిషనర్ కార్యాలయం, చేనేత మరియు జౌళి శాఖ, 4వ అంతస్తు, ఐహెచ్‌సి కార్పొరేట్ బిల్డింగ్, మంగళగిరి, గుంటూరు జిల్లా వారిని ఈనెల 26 తేదీ లోగా సంప్రదించి తమ వీడియోలను ఆగష్టు 1వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.

ఐక్యంగా అభివృద్ధి చేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రజా సమస్యలు పరిష్కరించి, అందరం కలసి మండలాన్ని అభివృద్ధి చేద్దామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శనివారం ఎంపిపి మహంతి కళ్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయం, విద్య, వైద్యం, తాగునీరు, రెవెన్యూ సమస్యలపై ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పూసపాటిరేగ, అల్లాడపాలెం, కందివలస, కొప్పెర్ల, చింతపల్లి, చౌడువాడ, కోనాడ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. గ్రామాల్లో ఇంటింటి కొళాయిలు వేస్తున్నామని చెప్పి సిమెంటు రోడ్లు తవ్వేసి చిందర వందర చేసేసారని వాపోయారు. వేసిన కుళాయిలు ద్వారా అయినా నీరు రావడం లేదని చెప్పారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ప్రవీణ్ శంకర్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. సమస్య ఉందని, బిల్లులు అవకపోవడంతో కాంట్రాక్టర్‌లు సగం సగం పనులు చేసారని ఆమెకు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇకపై ఏ గ్రామంలో కూడా పనులు చేయొద్దని తెలిపారు. వచ్చిన నిధులతో ముందుగా గ్రామాల్లో చేసిన పనులు పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్లు కాదని, ఎక్కడ బోరు వేసినా ఉప్పునీరు, కాలుష్యం నీరు సమస్య ఉందని అందుకే ఈ ప్రాంతానికి బయట నుండి తాగునీరు తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రెండేళ్లలో తాగునీటి సమస్యకు ఫుల్‌స్టాప్ పెడతానని మాటీ ఇచ్చారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

నడిపల్లి సమీపంలోని చంపావతి నదిలో బోరువేసి భోగాపురం విమానాశ్రయానికి నీరు పట్టుకుపోతున్నారని నడిపల్లి సర్పంచ్ లంకలపల్లి గాయత్రి ఎమెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో విద్యుత్ సమస్య, తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నాయని కొప్పెర్ల సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు సభ దృష్టికి తీసుకొచ్చారు. పూసపాటిరేగలో రక్షిత మంచినీటి పథకం శిధిలావస్థకు చేరిందని, తద్వారా తాగునీటి సమస్య ఏర్పడుతోందని సర్పంచ్ టొంపల సీతారం గోడు వినిపించారు. గత ప్రభుత్వంలో నిర్మించిన గోశాలలకు బిల్లులు మంజూరు అవలేదని, సురక్షిత మంచినీటి ట్యాంకుల శుద్ధి జరగడం లేదని చౌడువాడ ఎంపిటిసి పసుపులేటి లలితకళ లేవనెత్తారు. వెల్దూరు పంచాయతీ కిలుగుపేటలో శ్మశానం కబ్జాకు గురైందని, గోవిందపురం రెవెన్యూలో సర్వేనెంబర్ 28/6,7,8,9లో తోటపల్లి కాలువ కప్పేసి లే అవుట్ వేసారని గోవిందపురం ఎంపిటిసి తంగుడుబిల్లి సునీత, కుమిలి పంచాయతీ పరిధిలో బొర్రవానిపాలెంలో సర్వేనెంబర్ 10/18లో గ్రామానికి చెందిన 86 సెంట్లు భూమిని అక్రమణ చేస్తున్నారంటూ కుమిలి సర్పంచ్ మామిడి అప్పయమ్మ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. పతివాడ బర్రిపేట అంగన్‌వాడీ ఆయాను అకారణంగా తొలగించారని పేరాపురం ఎంపిటిసి పతివాడ తమ్మునాయుడు ఎంఇఒను నిలదీశారు. ముందుగా అడ్వాన్సు తీసుకుని ఆర్‌బికె నిర్మాణం చేయలేదని రెల్లివలస సర్పంచ్ ఇజ్జిరోతు అప్పలరాజు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలన్నీ పరిష్కారంచేస్తామని ఆమె హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ పి. సురేష్‌బాబు, జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి, పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, పతివాడ తమ్మునాయుడు తదితర సర్పంచులు, ఎంపిటిసిలు, అధికార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం మాధవి

అసెంబ్లీ సమావేశంలా జరగాలి : ఎమ్మెల్యే

మండల సమావేశం అసెంబ్లీ సమావేశంలా జరగాలని ఎమ్మెల్యే మాధవి అన్నారు. ముందుగా సభ్యులు మీ గ్రామాల్లో సమస్యలను ప్రశ్నలు రూపంలో ఎంపిడిఒకి పంపాలని అప్పుడు సమస్యలపై అధికార్లకు ఎంపిడిఒ సమాచారం ఇస్తారని చెప్పారు. ఆ సమస్యలపై పూర్తి సమాచారంతో అధికార్లు వచ్చి సభ్యులు ముందు చెప్పాలని దాని ద్వారా ప్రజలకు ఉపయోగం ఉంటుందని అన్నారు. లేకపోతే మూడు నెలలకొకసారి అందరం కూర్చొని వెళ్లిపోవడమే తప్పా ఉపయోగం ఉండదన్నారు. ఈ సమావేశంలో అడిగే సమస్యలు వచ్చే సమావేశంలో ఎంత వరకూ జరిగాయో అధికార్లు చెప్పాలన్నారు. లేకపోతే ఎందుకు చేయలేదో వివరణ ఇవ్వాలన్నారు. వచ్చే సమావేశం అలా జరగాలని ఎంపిడిఒ రాధికకు ఎమ్మెల్యే సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఆర్‌డిలతో కలిసి జిల్లాలోని 108 ప్రయివేటు ఆసుపత్రులను తనిఖీ చేసి, తనకు నివేదిక అందజేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఒను ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేయించు కున్న వారి వివరాలను పరిశీలించాలని, గర్భస్థ లింగ నిర్ధారణ చేసినవారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం-1994 అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. చట్టం అమలును కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఉన్న మొత్తం 88 స్కానింగ్ సెంటర్లపై ఆరా తీశారు. నిపుణులైన వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఇవి నడిచేలా చూడాలన్నారు. అనుమతులు ఇచ్చినప్పుడు కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేసి, నిబంధనల ప్రకారం అన్నీ సరిపోయినప్పుడు మాత్రమే స్కానింగ్ సెంటర్లకు అనుమతులు జారీ చేయాలని సూచించారు. జిల్లాలో స్త్రీపురుష నిష్పత్తిలో భారీ తేడాలు, అందుకు కారణాలపై ఆరా తీశారు. ఎట్టిపరిస్థితిలోనూ గర్భస్థ లింగనిర్ధారణ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాలు, అబార్షన్లన్నీ ఖచ్చితంగా పోర్టల్‌లో నమోదు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రులు అందిస్తున్న సేవలను తనిఖీ చేయాలని సూచించారు. అవకతవకలకు పాల్పడే ప్రయివేటు ఆసుపత్రుల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-వేపాడ


సిబ్బందితో మాట్లాడుతున్నజోనల్ అధికారి శాంతిప్రభ

విధుల్లో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మలేరియా నివారణ జోనల్ అధికారి శాంతిప్రభ హెచ్చరించారు. బొద్దాం పిహెచ్‌సి పరిధిలోని కెజిపూడి పంచాయతీలో ఆమె శుక్రవారం పర్యటించారు. మలేరియా కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గోతుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. అనంతరం పిహెచ్‌సి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. సిబ్బంది క్రమం తప్పకుండా గ్రామాల్లో పర్యటించాలని, మలేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తిరుపతిరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి- మెరకముడిదాం

వర్షాలు పడుతున్న సందర్భంగా అనేక వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గర్భాం, మెరక ముడిదాం పిహెచ్‌సిల వైద్యాధికారులకు జెడ్‌పి చైర్మన్ ఆదేశించారు. మెడికల్ కిట్లు ముందస్తుగా ఉంచుకోవాలని, అవసరమైతే గ్రామాలలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని, దోమలు నివారించే చర్యలు తీసుకోవాలని, ఆయా పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పప్పల కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్షాలు పడినందున రైతులకు ఎక్కువగా డిఎపి ఎరువులు అవసరం ఉంటుందని, ఆర్‌బికెల్లో అందుబాటులో లేదని ఒక్క యూరియా మాత్రమే ఉందని తెలిపారు. ఏ ఒక్క పాఠశాలలో కూడా విద్యార్థులు జ్వరం బారిన పడకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని ఎంఇఒకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ, డిపిఒ, నోడల్ అధికారి శ్రీధర్ రాజా, వైస్ ఎంపిపిలు తల చుట్ల హరి, కందుల పార్వతి, ఎంపిడిఒ పావని, వైసిపి నాయకులు తాడ్డి వేణు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్‌పి చైర్మన్, అధికారులు

థైరాయిడ్ పరికరం పునరుద్ధరణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని థైరాయిడ్ పరీక్షలు జరిపే యంత్ర పరికరం కొద్ది రోజుల క్రితం సాంకేతిక సమస్యల వల్ల మరమ్మత్తులకు గురైందని, అయితే దీనికి వారంటీ సమయం వున్నందున దీనిని సరఫరా చేసిన సంస్థకు సమాచారం ఇచ్చి మరమ్మత్తు చేయించామని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు. శనివారం నుంచి ఈ మిషన్ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజాశక్తి దినపత్రికలో 'మొరాయిస్తున్న మిషన్లు' శీర్షికతో ప్రచురితమైన వార్తపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందించి ఆసుపత్రి సూపరింటెండెంట్ వివరణ కోరారు. దీనిపై సూపరింటెండెట్ వివరణ ఇస్తూ అందుబాటులో వున్న పరిమిత సిబ్బందితోనే కేంద్రీయ ల్యాబ్ ద్వారా ప్రతిరోజూ 4 వేల టెస్టుల వరకు చేస్తున్నామని, ఉదయం 11.30 గంటల వరకు సేకరించే నమూనాలపై మధ్యాహ్నం 3గంటల సమయానికే టెస్టు రిపోర్టులు సిబ్బంది ఇస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో మొత్తం 615 పడకలకుగాను 450 పడకలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మరో 165 ఘోష ఆసుపత్రిలో మంజూరైనట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సర్వజన ఆసుపత్రిలో స్థలాభావం వల్ల 350 పడకలు మాత్రమే కేటాయించగలుగుతున్నట్టు తెలిపారు. పడకల కొరతను అధిగమించాలంటే మరో 100 పడకలకు సరిపడే స్థలం అవసరం ఉందని తెలిపారు.

అక్రమ ఇసుక రవాణాకు చెక్

నాగావళి నది వద్ద పోలీస్ పికెట్

ప్రజాశక్తి- రేగిడి

మండలం లోని సంకిలి పంచాయతీ బొడ్డవలస, రేగిడి, కొమిరి, వెంకటాపురం తదితర నాగావళి నది తీర గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణాపై రేగిడి ఎస్ఐ ఈ శ్రీనివాసరావు, రాజాం ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం నుంచి ఆయా నది తీర ప్రాంతా గ్రామాల్లో షిఫ్ట్‌ల వారీగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేసిన యజమానులపై కేసులు తప్పన్నారు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఇసుక యథేచ్ఛగా ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అందుకు ట్రాక్టర్, లారీ యజమానులు సహకరించాలని సూచించారు.

యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులకు గురైన పలు ప్రాంతాలలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు పర్యటించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. 6,12,35,37,59, సచివాలయాల పరిధిలలో జరుగుతున్న పారిశుధ్య పనులు, కాలువల్లో పూడికతీత పనులు, నేలకొరిగిన చెట్లను దగ్గరుండి పరిశీలించారు. కట్టర్ల సహాయంతో విరిగిపడిన చెట్ల కొమ్మలను కత్తిరించి రహదారికి ఇబ్బంది లేకుండా తొలగించి వేశారు. దాసన్నపేట రైతు బజారు వద్దకు వెళ్లి కూరగాయల విక్రయదారులతో కొద్దిసేపు మాట్లాడారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ఆవశ్యకత పై అవగాహన కల్పించారు. ఆయన వెంట డిఇ అప్పారావు, శానిటేషన్ కార్యదర్శులు ఉన్నారు.

డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, బొబ్బిలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎమ్మెల్యే బేబీనాయనను కోరారు. శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతి అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. పట్టణంలో ఎస్‌టి బాలుర వసతిగృహానికి సొంత భవనం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. పట్టణానికి దూరంగా ఉన్న ఎస్‌టి బాలికల వసతిగృహాన్ని పట్టణానికి తరలించాలన్నారు. కోమటిపల్లిలో ఉన్న బిసి బాలుర వసతిగృహాన్ని బొబ్బిలిలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపయోగపడేలా పట్టణానికి తరలించాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో పర్మినెంట్ వర్కర్లను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణికుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రామభద్రపురం

సీజనల్ వ్యాధులపై నేరెళ్లవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహ విద్యార్థులకు శనివారం పిహెచ్‌సి వైద్యాధికారి దిలీప్‌కుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న నలుగురు విద్యార్థుల రక్త పూతలు సేకరించి, ఆర్‌టిడి పరీక్ష చేశారు. నెగిటివ్ రిపోర్ట్ వచ్చినట్లు ఆయన తెలిపారు. వర్షాకాలంలో అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వేడి ఆహార పదార్థాలు తినాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని విద్యార్థులకు సూచించారు. వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వాసుదేవరావు, హాస్టల్ వార్డెన్ సోములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్య పనులు పక్కగా చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఇంచార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బందితో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా కాలువలలో ఎంఎల్ ఆయిల్ పిచికారీ చేయడం, దోమల నివారణకు ఫాగింగ్ చేసి, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. ప్రతీ రోజూ ప్రజలకు తాగునీటిని క్లోరినేషన్ చేసిన తరువాత సరఫరా చేయాలని సంబందిత ఇంజనీర్లుకు ఆదేశించారు. సమావేశంలో పలువురు శానిటరీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

తెర్లాం : జగన్నాథవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన టిడిపి కార్యాలయాన్ని ఎమ్మెల్యే బేబినాయన శనివారం ప్రారంభించారు. గోపాలవలస గ్రామానికి వెళ్లడానికి సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతి అందించారు. గ్రామంలో కరెంటు సమస్య ఉందని ఆ సర్పంచ్ ప్రతినిధి అప్పల నరసింహరాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు టిడిపి మండల అధ్యక్షులు వెంకట నాయుడు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు వెంకటేశ్వరరావు, అమరాపు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

విజయనగరం కోట : నగరంలోని సంతకాల వంతెన ప్రహరీ గోడ పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆయన వయసు 50ఏళ్లు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు కాఫీ గులాబీ రంగుల నిలువ గీతలతో ఉన్న తెల్ల షర్టు, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

హాస్టల్‌ను పరిశీలించిన ఎఎస్‌డబ్ల్యుఒ

తెర్లాం : మండల కేంద్రంలో ఉన్న ఎస్‌సి హాస్టల్‌ను బొబ్బిలి ఎఎస్ డబ్ల్యుఒ సత్యనారాయణ శనివారం రాత్రి పరిశీలించారు. హాస్టల్లో ఉన్న ప్రతి సమస్యలను అధికారులకు తెలియజేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పిల్లల మెనూను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి అవసరమైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వై.అప్పన్న పాల్గొన్నారు